

పుస్తకాలతో దోస్తీ చేద్దాం
- పరీక్షల కాలం.. ప్రణాళికతో చదువుదాం
- ఆట, పాటల జోలికి వెళ్లొద్దు
- మానసిక ఒత్తిడిని అధిగమించాలి
- ఆహారపు నియమాలు తప్పనిసరి
- నిపుణుల సలహాలు పాటిస్తే పరీక్షలు ఈజీ

7

చిన్నారిపై వీధి కుక్కల దాడి



కుక్కల దాడిలో చిన్నారి వీపుపై గాయాలు

పటాన్‌చెరు రూరల్/రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల చిన్నారిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన ముత్తంగి గ్రామ పరిధిలోని న్యూటౌన్ కాలనీలో శుక్రవారం జరిగింది. కుక్కలు చిన్నారిని లాక్కెళ్లేందుకు ప్రయత్నించగా స్థానికులు రక్షించారు. బాధితులు, స్థానికుల కథనం ప్రకారం న్యూటౌన్ కాలనీలో నివసించే ఖమ్రుద్దీన్ కుమారుడు ఉస్మాన్ సాయంత్రం ఇంటి ఎదుట ఆడుకుంటున్న సమయంలో వీధి కుక్కలు అతడిపై దాడి చేసి తీవ్రంగా కరిచాయి. రక్తసిక్తమైన చిన్నారిని లాక్కెళ్లే ప్రయత్నం చేశాయి. పిల్లవాడి అరుపులు విన్న స్థానికులు కుక్కలను తరిమారు. ఉస్మాన్‌కు వీపుపై, చేతిపై, నడుముపై గాయాలవడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు దవాఖానాకు తరలించి చికిత్సను అందజేస్తున్నారు. న్యూటౌన్ కాలనీలో అంగన్వాడీ కేంద్రం ఎదుట, పల్లె ప్రకృతివనంలో, వాటర్‌ట్యాంక్ వద్ద పెద్ద సంక్యలో వీధి కుక్కలు ఉంటాయని, పిల్లలు కనిపిస్తే దాడి చేస్తున్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. కుక్కలను నియంత్రించడంలో అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐఐటీహెచ్‌లో 21 నుంచి


'ఎలాన్ ఎన్ విజన్'

దేశం నలుమూలల నుంచి

తరలిరానున్న 50 వేల మంది విద్యార్థులు

కంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్ ఈ నెల 21 నుంచి 23 వరకు 'ఎలాన్ ఎన్ విజన్ 16వ ఎడిషన్' వార్షిక సాంస్కృతిక, సాంకేతిక వేడుకలు జరగనున్నాయి. ఫిబ్రవరి 23న జరిగే గ్రాండ్ పాప్ నైట్ క్యోన్, మోహ్ మోహ్ కే ధాగే, జియెయిన్ క్యున్, బుల్లెయా వంటి చార్ట్-టాపింగ్ హిట్‌లకు పేరుగాంచిన లెజెండరీ మిస్టర్ పాపోన్ శీర్షికన నిర్వహించబడుతుంది. అతనితో కలిసి డీజే స్వాట్రిక్స్ ఎలక్ట్రానిక్ సంగీత ప్రియులందరికీ తన గ్రూవీ బీట్‌లను వేదికపైకి తీసుకువస్తారు. 21 ఫ్యూజన్ నైట్ ప్రారంభోత్సవ వేడుకతో ప్రారంభమవుతుంది. 22న ఇండీ నైట్ ఒక ప్రత్యేకమైన లైనప్‌ను కలిగి ఉంటుంది, వినూత్నమైన ఫ్లూట్ బీట్‌బాక్సింగ్, ఫ్లూట్‌బాక్సర్‌లు వారి అసాధారణమైన క్లాసికల్ ఫ్లూట్, కాంటెంపరరీ బీట్‌బాక్సింగ్ కలయికను ప్రదర్శిస్తాయి. దేశవ్యాప్తంగా ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రతిభావంతులైన గాయని-సంగీతకారిణి శ్రేయా జైన్‌తో రాత్రి జరుగుతుంది. ఇండీ రాక్ బ్యాండ్ ది లీడింగ్ డాన్స్ ప్రదర్శనతో రాత్రి ముగుస్తుంది. టైటిల్ స్పాన్సర్‌గా గ్రీన్ కో, ఏఎమ్‌గ్రీన్‌కో సంస్థలు వ్యవహరించనున్నాయి. దేశవ్యాప్తంగా వివిధ ఇంజనీరింగ్ కళశాలల నుంచి దాదాపు 50 వేల మంది విద్యార్థులు పాల్గొంటారు. పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి వెల్లడించారు.

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోరు రసవత్తరంగా మారుతున్నది. రెండు స్థానాలకు భారీగా పోటీ నెలకొన్నది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రేసులో 56 మంది, టీచర్ల పోరులో 15 మంది నిలిచారు. పోలింగ్ తేదీ (ఈ నెల 27) సమీపిస్తుండడంతో ప్రచార హడావుడి ప్రారంభమైంది. విద్యాధికులే ఓటర్లైన పోరు రాజకీయ రంగు పులుముకోవడంతో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలను తలపిస్తున్నాయి.



ఎమ్మెల్సీ దంగల్

రెండు స్థానాలకు 71 మంది పోటీ

- గ్రాడ్యుయేట్స్, టీచర్స్ అభ్యర్థుల హోరాహోరీ ప్రచారం
- సోషల్ మీడియా, ఫోన్‌కాల్స్‌తో పలకరింపు
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్, బీజేపీ
- దూసుకెళ్తున్న పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థులు
- ఉపాధ్యాయ అభ్యర్థుల పరస్పర ఆరోపణలు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 14 : మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో ఎక్కడ చూసిన ఎమ్మెల్సీ ఎన్నికల చర్చ నడుస్తున్నది. కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. బలమైన అభ్యర్థులను బరిలోకి దింపడంతో పాటు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నాయి. కాంగ్రెస్ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో మంత్రులు పాల్గొనగా, సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి మద్దతుగా

మిగతా 7వ పేజీలో

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు

ఉట్కూరి నరేందర్‌రెడ్డి, చిన్నమైల్ అంజిరెడ్డి, యాదగిరి శేఖర్‌రావు, ప్రసన్న హరికృష్ణ, సర్దార్ రవీందర్‌సింగ్, బక్క జడ్సన్, దొడ్ల వెంకటేశం, మంద జ్యోతి, లంటు చంద్రశేఖర్, సిలివేరి ఇంద్రాగౌడ్, బి.సుభాష్, అక్కెనపల్లి కరుణాకర్, అవినాశ్ జాదవ్, అబ్బగోని అశోక్‌గౌడ్, మేకల అక్షయ్‌కుమార్, అంగ సంపత్‌యాదవ్, కర్ర జగన్నాథ్, కస్ప శంకర్‌రావు, కంటె సాయన్న, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, గవ్వల శ్రీకాంత్, గుమ్మడి శ్రీశైలం, చంద సాయికుమార్, చిట్కుల నరేందర్‌రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి, చలిక చంద్రశేఖర్, జావెద్ అహ్మద్, దయ్యాల ఓంప్రకాశ్, దూడ మహిపాల్, దేవతి శ్రీనివాస్, దేవునూరి రవీందర్, నగేశ్ కొమ్ముల, నిమ్మతోట వెంకటేశ్వర్లు, పిడిశెట్టి రాజు, పులగం దేవదాసు, బాలాజీ భక్వాడ్, బండారి రాజ్‌కుమార్, బండి శ్రీనివాస్, మచ్చ శ్రీనివాస్, మల్లేశ్ యాసర్ల, మహ్మద్ ముస్తాక్ అలీ, మహేశ్ కొమ్మిరెడ్డి, మెతుకు హేమలత, మంచికట్ల ఆశమ్మ, రమేశ్‌బాబు శనిగరం, రాజసుమన్‌రావు, రాపాల రాజు, లైశెట్టి హరికృష్ణ, రాథోడ్ రవీందర్ నాయక్, వేముల కరుణాకర్‌రెడ్డి, వేముల విక్రంరెడ్డి, శ్రీకాంత్ సిలివేరు, ఎన్.శ్రీనివాస్, సాయికృష్ణమూర్తి, టి.సుధాకర్‌రావు, సంకినేని మధుసూదన్‌రావు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు వీరే..

వంగ మహేందర్‌రెడ్డి, మల్క కొమురయ్య, జగ్గు మల్లారెడ్డి, కూర రఘోత్తమరెడ్డి, వై.అశోక్‌కుమార్, యాటకారి సాయన్న, గవ్వల లక్ష్మి, కంటె సాయన్న, చలిక చంద్రశేఖర్, ఇన్నారెడ్డి తిరుమల రెడ్డి, మామిడి సుధాకర్ రెడ్డి, ముత్తారం నర్సింహ స్వామి, వేముల విక్రమ్ రెడ్డి, సిలివేరు శ్రీకాంత్, ఎల్.సుహాసిని.

మెదక్-కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో పట్టభద్రుల ఓట్లు

మొత్తం	3,41,313
పురుషులు	2,18,060
మహిళలు	1,23,250

గ్రాడ్యుయేట్ ఓట్ల వివరాలు

జిల్లా	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	40	6766	14437	21203
మెదక్	22	3420	8533	11953
సిద్దిపేట	40	10624	20922	31546
మొత్తం	102	20,810	43,892	64,702

నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఉపాధ్యాయ ఓట్లు

మొత్తం	25,921
పురుషులు	16,364
మహిళలు	9,557

టీచర్స్ ఓట్ల వివరాలు

జిల్లా	కేంద్రాలు	మహిళలు	పురుషులు	మొత్తం
సంగారెడ్డి	28	1103	1485	2588
మెదక్	21	515	766	1281
సిద్దిపేట	23	1104	1948	3052
మొత్తం	72	2,722	4,199	6921

భూ తగాదాలతో

తమ్ముడిని చంపిన అన్న

మునిపల్లి, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): భూ తగాదాలు.. పాత కక్షల కారణంగా సొంత తమ్ముడిని అన్న అతి దారుణంగా హత్య చేసిన సంఘటన సంగారెడ్డి జిల్లా చీలపల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. మునిపల్లి ఎస్‌ఐ రాజేష్‌నాయక్ కథనం ప్రకారం.. మండలంలోని చీలపల్లి గ్రామానికి చెందిన మల్కాగోని దుర్గయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. ఆయనకు ముగ్గురు కుమారులు (యాదయ్య, శివయ్య, నాగేష్) ఉన్నారు. తండ్రి దుర్గయ్య తన ఎకరం భూమిని అవసరాల నిమిత్తం ఓ వ్యక్తి వద్ద తాకట్టు పెట్టి డబ్బులు తీసుకున్నారు. తండ్రి మృతి చెందడంతో తాకట్టు పెట్టిన భూమి విషయంలో ముగ్గురు అన్నదమ్ముల మధ్య గొడవలు జరిగేవి. తాకట్టు పెట్టిన భూమిని డబ్బులు చెల్లించి యాదయ్య తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి యాదయ్య, శివయ్య మధ్య గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం కూడా భూమి విషయమై యాదయ్య.. శివయ్యల మధ్య ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో యాదయ్య ఆగ్రహంతో తమ్ముడు శివయ్యను బండరాయితో బలంగా కొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను కుటుంబ సభ్యులు సదాశివపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. చనిపోయిన శివ్వయ్య భార్య మల్కాగోని అనిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో

ఐదుగురి మృతి

చేగుంట మండలం

చిన్నశివనూరు వద్ద ఇద్దరు సీఆర్పీలు..

తొగుట, మాసాయిపేట, బెజ్జంకిలో ఒక్కొక్కరు..

7



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రజలు వద్దంటున్నా పట్టించుకోరా?

- బంగారు పంటలు పండించే ప్రాంతం నిర్వీర్యమవుతుంది
- బీఆర్ఎస్ హయాంలో ఆ ప్రతిపాదనను పక్కన పెట్టాం
- ఈ ప్రభుత్వం పోలీసుల బలంతో నిర్మించాలని చూస్తున్నది
- హైకోర్టు ఉత్తర్వులను అమలుచేసే బాధ్యత కలెక్టర్‌దే..
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- జేఏసీ దీక్షకు సంఘీభావం



రైతుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు

గుమ్మడిదల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా ప్రభుత్వం పోలీసుల పహారా మధ్య ప్యారానగర్‌లో డంపుయార్డ్‌ను నిర్మించాలని చూస్తున్నదని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. గుమ్మడిదలలో డంపుయార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రైతు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం ఆయన ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుతో కలిసి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్యారానగర్‌లో డంపుయార్డ్ ఏర్పాటు చేస్తే ఉమ్మడి మెదక్ జిల్లా తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. బంగారు పంటలు పండించే గుమ్మడిదల మండలం కాలుష్య కాసారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల డిమాండ్ మేరకు డంప్‌యార్డు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎయిర్ ఫోర్స్ అధికారులు సైతం ఇక్కడ డంప్‌యార్డు వద్దని జిల్లా కలెక్టర్‌కు లేఖ రాశారని గుర్తుచేశారు. పది రోజులుగా ప్రజలంతా ఒక్కటై నిరసనలు తెలుపుతుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధకరమన్నారు. యార్డు నిర్మాణాన్ని నిలిపేయాలనే కోర్టు ఉత్తర్వులను అమలుచేసే బాధ్యత కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్లపై ఉందని స్పష్టం చేశారు. కోర్టు ఉత్తర్వులను కాదంటే న్యాయస్థానం ముందు నిలబడాల్సి నిలబడాల్సి వస్తుందని హెచ్చరించారు. కోర్టు ఉత్తర్వులు, ప్రజల అభిప్రాయాలను గౌరవించి పనులు ఆపాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వేదికగా ఈ సమస్యపై పోరాటం చేస్తానని తెలిపారు. డంప్‌యార్డు ఏర్పాటును తక్షణమే రద్దు చేయకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, ఆదర్శ్‌రెడ్డి, కొలాన్ బాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి, రాజేష్ నరసింహారెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, సంతోషరెడ్డి, సదానందరెడ్డి, దేవేందర్‌రెడ్డి, వివిధ ప్రజా సంఘాలు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎంలు మారినా ప్రజల తలరాత మారలేదు

- 6 గ్యారంటీలు.. 420 సబ్ గ్యారంటీల అమలు ఎక్కడ?
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- ఫాంహౌస్ పాలనతో సమస్యలు పరిష్కారం కావు : మెదక్ ఎంపీ రఘునందన్‌రావు



ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

కంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలన పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా.. సీఎంలు మారారే కానీ ప్రజల తలరాత మారలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు, గనులు, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మెదక్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ల్లో భాగంగా శుక్రవారం నాడు కందిలో పట్టభద్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 6 ప్రధాన గ్యారంటీలు, 420 సబ్ గ్యారంటీలు ఎక్కడని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని యువత, మహిళలు కాంగ్రెస్ నాయకులను నిలదీస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా లేరని విమర్శించారు. గత 10 సంవత్సరాల్లో గ్రామ పంచాయతీలలో తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, శ్మశానవాటికలకు నిధులు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వమేనని గుర్తుచేశారు. రానున్న రోజుల్లో తెలంగాణ అభివృద్ధికి మరిన్ని నిధులు ఇస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమరయ్య, అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ గతంలో ఫాంహౌస్ పాలనతో.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనతో ప్రజల సమస్యలు తీరడం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకే నాణానికి బొమ్మా బొరుసు లాంటివని విమర్శించారు. నువ్వు కొట్టినట్టు చెయ్యి.. నేను తిట్టినట్టు చేస్తా.. అన్నట్టు ఆ పార్టీల తీరు ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ మాటలు కోటలు దాటాయి కానీ, చేతలు తంగేళ్ల దాటడం లేదని దుయ్యబట్టారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడం లేదన్నారు. అన్యాయంగా తొలగించిన 400 మంది ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మాజీ ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమరయ్య, అంజిరెడ్డి, నాయకులు కొండాపురం జగన్, పోచారం రాములు, నల్ల నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కంది పగడం చెరువులో మొరం తవ్విన ఆనవాళ్లు

చెరువు గుల్ల

- రాత్రివేళ అక్రమ తవ్వకాలు
- నిమ్మకు నీరెత్తని రెవెన్యూ, మైనింగ్ శాఖ
- లక్షల విలువైన ప్రభుత్వ ఆదాయానికి గండి

కంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కంది మండల కేంద్రంలో మట్టి దళారులు రెచ్చిపోతున్నారు. అర్ధరాత్రి చెరువులు, కుంటలను తవ్వేస్తున్నారు. మొరం, మట్టిని తవ్వేసి వెంచర్లలో రోడ్లు వేయడానికి, అపార్ట్‌మెంట్ల నిర్మాణాల్లో బేస్మెంట్లలో నిపండానికి వియోగిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌లోడు రూ.6వేల చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారు జాము వరకు కందిలోని పగడం చెరువులో రెండు ఎక్స్‌కవేటర్లు, పది టిప్పర్లతో నిరంతరాయంగా మట్టిని తరలించారని స్థానికులు చెబుతున్నారు. మైనింగ్, రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్టుగా ఉండడంతో అక్రమార్కులకు అడ్డు లేకుండాపోతోందని మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పగడం చెరువులో మట్టి తవ్వడానికి తీసుకువచ్చిన ఎక్స్‌కవేటర్

మా స్థలాల్లో

నిర్మాణాలను అడ్డుకోండి

- సీఎం రేవంత్ రెడ్డి, హైడ్రా స్పందించాలి
- ప్రాణాలు పోయినా ప్లాట్ల కోసం పోరాడుతాం
- రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ ప్రతినిధులు



స్థలాల పత్రాలను చూపుతున్న బలాపూర్ రాజగోపాల్‌నగర్ అసోసియేషన్ ప్రతినిధులు

పంజాగుట్ట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): 'పైసాపైసా కూడబెట్టి ప్లాట్లు కొనుగోలు చేస్తే కబ్జా చేసి అమ్ముకుంటున్నరు. మా ప్లాట్లలో భవనాలు నిర్మిస్తూ.. ఇదేమిటని అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి మాకు న్యాయం చేయాలి' అని బలాపూర్ రాజగోపాల్‌నగర్ ప్లాట్ల వాసులు వేడుకుంటున్నారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం బలాపూర్ గ్రామంలో సర్వే నంబర్లు 119 నుంచి 220 వరకు ఉన్న 408 ఎకరాల్లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో తాము 1984లో స్థలాలను కొనుగోలు చేశామని తెలిపారు. ఈ ప్లాట్లను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల అండదండలతో కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి కబ్జా చేశారని తెలిపారు. 2010, 2015, 2020 సంవత్సరాల వరకూ ఎలాంటి ఆక్రమణలు లేవని, 2020-2021 నుంచి కబ్జాదారులు తమ ప్లాట్లను దొంగపత్రాలతో నోటరీ, జీపీఏ చేసి తక్కువ ధరకే విక్రయిస్తున్నారని తెలిపారు. ఓ మాజీ ఎమ్మెల్సీ రంగప్రవేశం చేసి తనకు ఇక్కడ భూమి ఉందని చెప్పి, తన సామాజిక వర్గం వారితో గుడిసెలు, ఇళ్లు కట్టిస్తున్నారని, తాము అక్కడికి వెళ్తే చంపేస్తామని బెదిరిస్తున్నారని వాపోయారు. తమకు అధికార పార్టీ నాయకుడు, రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ చైర్మన్ సోదరుడు, నాయకులు తన వెనకాల ఉన్నారని కబ్జాదారులు బెదిరిస్తున్నారని వాపోయారు. తమ ఫిర్యాదు మేరకు ఇటీవల 250 వరకు నిర్మాణాలను అధికారులు కూల్చివేశారని వెల్లడించారు. కబ్జాలపై తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే స్టేటస్‌కో విధించిందని తెలిపారు. న్యాయస్థానం ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ సదరు స్థలాలలో అక్రమ నిర్మాణాలను చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం తుది తీర్పు వెలువడే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గత నెల హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నామని, తమ వద్ద ఉన్న పత్రాలు, న్యాయస్థానం తీర్పు పత్రాలు, భూమికి సంబంధించి ఫొటోలు కూడా ఇచ్చామని తెలిపారు. ఈ నెల 7న ఆయన స్థలం వద్దకు స్వయంగా వచ్చి పరిశీలించారని, ప్లాట్ల యజమానులు, బాధితులతో మాట్లాడారని తెలియజేశారు. కబ్జాకు పాల్పడుతున్న సుప్రీంకోర్టు న్యాయవాదినని చెప్పుకుంటున్న ఓ వ్యక్తి ఆయనతో వాగ్వాదానికి దిగారన్నారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని త్వరలో సీఎంను కలుస్తామని తెలిపారు. అవసరమైతే ఢిల్లీలో ధర్నా చేస్తామని, సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ కోశాధికారి రమేష్, శ్రీనివాస్ రావు, విష్ణువర్ధన్ రెడ్డిలతో పాటు పలువురు బాధితులు పాల్గొన్నారు.



పరిహారం చెల్లించాలంటూ అన్నదాతల ఆందోళన

చిన్నకోడూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తమకు నష్ట పరిహారం చెల్లించాలని చిన్నకోడూరు మండలంలోని గంగాపూర్ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం గ్రామ శివారులో రైల్వే లైన్ నిర్మాణ పనులను అడ్డుకొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా ఏడాది క్రితం గ్రామానికి చెందిన 18 మంది రైతుల నుంచి సుమారు 10 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు సేకరించారని తెలిపారు. పనులు ప్రారంభించిన పరిహారానికి సంబంధించి చెక్కులు అందజేయలేదన్నారు. ఈ విషయమై పలు మార్లు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోయారు. ఆందోళన విషయం తెలుసుకున్న చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని నిరసన తెలుపుతున్న రైతులతో మాట్లాడారు. ఈ విషయాన్ని సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని చెప్పారు. సాయంత్రం సిద్దిపేట కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మనుచౌదరి బాధిత రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రైతు కూలీలకు బీమా వర్తింపజేయాలి

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

గజ్వేల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రైతు కూలీలకు బీమాను వర్తింపజేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని గిరిపల్లి గ్రామానికి చెందిన బండారి మల్లయ్య, ఆయన కుమారుడు బండారి రవిందర్ అప్పులబాధతో ఆత్మహత్య చేసుకోగా, వారి కుటుంబాన్ని శుక్రవారం ఆయన పరామర్శించారు.

రబ్బర్ బియ్యం కాదు.. ఫోర్టిఫైడ్ రైస్



గూడూరులో ఫోర్టిఫైడ్ రైస్‌ను తీసివేస్తున్న మహిళ

- పోషకాల మిళితం.. ఆరోగ్యదాయకం
- తెలియక వేరు చేస్తున్న కొందరు
- అవగాహన కల్పించని అధికారులు

శివ్వంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రేషన్ బియ్యంలో ఫోర్టిఫైడ్(బలవర్ధక) రైస్‌ను కలిపి పంపిణీ చేస్తున్నది. సాధారణ బియ్యానికి పోషకాలను జోడించి అందిస్తున్నది. ఇవి బియ్యానికి కాస్త భిన్నంగా కనిపించడంతో చాలామంది వీటిని రబ్బర్ బియ్యంగా అపోహ పడుతూ తీసివేసి తింటున్నారు. ఈ విషయమై అవగాహన చేపట్టాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. మండల పరిధిలోని గూడూరు గ్రామంలో శుక్రవారం ఓ మహిళ రేషన్ బియ్యంలోని ఫోర్టిఫైడ్ రైస్ వేరు చేస్తూ కనిపించింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫోర్టిఫైడ్ రైస్‌లో లభించే పోషకాలు, వాటిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ కమలాద్రిని సంప్రదించగా ప్రజల్లో రక్త హీనత నివారణకు, రోగ నిరోధక శక్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం సకల పోషకాలు కలిగిన బలవర్ధక బియ్యాన్ని రేషన్‌లో కలిపి అందిస్తుందన్నారు. ప్రజలెవరూ అపోహలు పడకుండా నిర్భయంగా వాటిని వండుకుని తినవచ్చునని తెలిపారు.



క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మల్లయ్య మృతదేహం

అల్లాదుర్గం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన అల్లాదుర్గం మండలంలోని సీతానగర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కాయిదంపల్లి గ్రామానికి చెందిన మసిరిగారి మల్లయ్య(50) ఈ నెల 13న ఉదయం ఇంటి నుంచి బయటికెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సీతానగర్ గ్రామ శివారులోని ఒకరి వ్యవసాయ భూమి వద్ద మల్లయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమార్తె భేతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మల్లయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నీట మునిగి..



పోచయ్య(ఫైల్)

హవేళిఘణపూర్, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : బావి నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శమ్నాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి పోచయ్య(38) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు కుమారుడు జయంత్‌తో కలిసి వెళ్లాడు. బావిలోని మోటారు పనిచేయకపోవడంతో అందులోకి దిగి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. ఎంతసేపటికీ పోచయ్య బావిలో నుంచి బయటకు రాకపోవడంతో అతడి కుమారుడు జశ్వంత్ తన చినాన్న శంకర్‌కు సమాచారం అందించాడు. దీంతో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాజు తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుంటలో పడి..



జయరాములు (ఫైల్)

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పిడిచేడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గద్ద జయరాములు(51)కు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం సాయంత్రం పోల్కమ్మకుంట సమీపంలో బహిర్భూమికని వెళ్లి ఎంతసేపటికి తిరిగి రాలేదు. దీంతో అతడి భార్య తన బావ బక్కాయి రాములుతో కలిసి కుంటవద్ద, చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. కాగా, శుక్రవారం మధ్యాహ్నం బక్కాయి రాములు బర్రెలను తీసుకొని పోల్కమ్మ కుంటకు వెళ్లగా జయరాములు కుంటలో శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

జిన్నారం, ఫిబ్రవరి 14 (ఆంధజ్యోతి): పెద్దవాగు నీటిలో వ్యక్తి మృతదేహం లభించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మాదారం పరిధి దువ్వకుంట గ్రామ శివారులోని పెద్దవాగునీటిలో శుక్రవారం వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ రవీందర్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డులో పేరు గౌతమ్ గైక్వాడ్ (38), మహారాష్ట్రలోని నవజీవన్ ఆర్వో నంబర్ 1106, బుద్ధవిహార్, తాలుకా వాసాయ్ పాలిఘర్ చిరునామా ఉన్నది. కాగా, మృతుడు ఎక్కడ నివసిస్తున్నాడు, ఆయన మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు మృతి చెందారు. చేగుంట మండలం చిన్నశివనూరు వద్ద ఇద్దరు సీఆర్పీలు దుర్మరణం చెందగా, తొగుట, మాసాయిపేట, బెజ్జంకిలో ఒకరు చొప్పున మృత్యువాత పడ్డారు.



రమేష్ నాయక్, శ్రీనివాస్(ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సీఆర్పీలు మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా చేగుంట మండల పరిధిలోని చిన్నశివనూర్ గ్రామ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చేగుంట మండలంలోని గొల్లపల్లిజాత్రం తండాకు చెందిన రమేష్‌నాయక్ (40), చందాయపేట గ్రామానికి చెందిన ఎర్ర శ్రీనివాస్(44) మక్కరాజుపేట కాంప్లెక్స్ పాఠశాలల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులు(సీఆర్పీ)గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం పాఠశాలలో విధులు ముగించుకొని చేగుంటకు వస్తుండగా గజ్వేల్ వైపు వెళ్తున్న ట్రాలీ ఆటో వారి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో రమేష్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రగాయాలైన శ్రీనివాస్‌ను గజ్వేల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. రమేష్‌నాయక్ భార్య భూలక్ష్మి తండాలోని మినీ అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎర్ర శ్రీనివాస్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బుల్లెట్ బండి ఢీకొని

తొగుట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. తొగుట ఎస్‌ఐ రవి కాంత్ కథనం ప్రకారం.. మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన దొంతి యాదగిరి(34) ఘనపూర్ నుంచి తుక్కాపూర్‌కు నడుచుకుంటూ వస్తున్నాడు. ఘనపూర్ శివారులోని కోళ్ల ఫారాల వద్దకు రాగానే వెనకాల నుంచి బుల్లెట్ బండిపై వస్తున్న శివంగి ప్రశాంత్ అతివేగంగా వచ్చి యాదగిరిని ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో అతడి మేనత్త గ్రామం తుక్కాపూర్‌లో నివాసముంటున్నాడు. అతడి మేనత్త లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ డివైడర్‌కు ఢీకొని..



రవి మృతదేహం

మాసాయిపేట. ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మాసాయిపేట లోని బంగారమ్మ గుడి ఎదురుగా 44 వ జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌కు చెందిన బాయికాడి రవి (28) మరో ఇద్దరు స్నేహితులు శివకుమార్, భానుతో కలిసి బైక్‌పై తూప్రాన్ వైపు వెళ్తున్నారు. దీంతో బైక్ అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొనడడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా బాయికాడి రవి(28) మార్గమధ్యలోనే మృతి చెందాడు. శివకుమార్, భాను ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట పోలీసులు తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని..



అభిషేక్ (ఫైల్)

బెజ్జంకి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని రేగులపల్లి స్టేజీ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన అభిషేక్(23), అతని బంధువు భానుప్రసాద్ ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంపై వస్తూ రేగులపల్లి స్టేజి వద్ద కరీంనగర్ వైపు వెళ్లేందుకు యూటర్న్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సిద్దిపేట నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ద్విచక్రవాహనం యూటర్న్ తీసుకుంటున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన అభిషేక్, భానుప్రసాద్, అభినయ్‌ను 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అభిషేక్ మృతి చెందాడు. తీవ్ర గాయాలైన భానుప్రసాద్, అభినయ్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

పుస్తకాలతో కుస్తీ వద్దు.. దోస్తీ చేద్దాం



- పరీక్షల కాలం.. ప్రణాళికతో చదవాలంటున్న నిపుణులు
- ఆట, పాటల జోలికి వెళ్లొద్దు
- మానసిక ఒత్తిడిని అధిగమించాలి
- ఆహారపు నియమాలు తప్పనిసరి

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : ఏడాదంతా సంతోషంగా ఆట, పాటలతో సమయం తెలియకుండా గడిపిన విద్యార్థుల్లో పరీక్షలు మొదలవుతున్నాయంటే చాలు ఒక్క సారిగా టెన్షన్ మొదలవుతుంది. ఇన్నాళ్లు ఒక ఎత్తయితే ఇప్పుడు చదివి, రాసేది మరో ఎత్తు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి ఆందోళనకు గురికాకుండా పరీక్షకు సన్నద్ధమవుతే విజయం సులువు అవుతుందని పలువరు నిపుణులు సూచిస్తున్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5 నుంచి 25 వరకు, పదోతరగతి పరీక్షలు మార్చి 21 నుంచి ఏప్రిల్ 4 వరకు జరగనున్నాయి. కాబట్టి విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టి చదివి, పగలు, రాత్రి అని తేడా లేకుండా చదివితే గతంలో చదివిన అంశాలను కూడా మర్చిపోయే ప్రమాదముందని నిపుణులు చెబుతున్నారు. అలా కాకుండా పుస్తకాలతో దోస్తీ చేస్తూ ఒక ప్లాన్ ప్రకారం చదువాలని సూచిస్తున్నారు. అలాగని మరి ఒత్తిడి, నిద్రలేమితో చదువుతూనే ఉండటం వలన మొదటికే మోసం వస్తుందని హెచ్చరిస్తున్నారు. ముందుగా పరీక్ష అనే భయాన్ని తొలగించుకోవాలని సూచిస్తున్నారు. అంతేకాకుండా పరీక్ష రాసే విధానం, ఆహార నియమాలపై వారు పలు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

నిపుణుల సూచనలివివే..

- మసాలా, కారం ఆహార పదార్థలకు దూరంగా ఉండాలి. వీటివల్ల దాహం ఎక్కువగా అయ్యి ఏకాగ్రతకు ఆటంకం కలుగుతుంది.
- వేసవి దృష్ట్యా మజ్జిగ, నిమ్మరసం, గ్లూకోస్ వాటర్ తరచూ తీసుకుంటుండాలి.
- ఆహారాన్ని మితంగా తీసుకోవాలి. అధికంగా తినడంవల్ల నిద్ర వచ్చి ఏకాగ్రత నశిస్తుంది.
- చదువుకొనే గదిని ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాలి. పుస్తకాలు మాత్రమే ఉంచుకోవాలి. ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండాలి.
- పాత ప్రశ్న పత్రాలను తిరిగేయాలి. సమాధానం దొరకని, అర్థం కాని ప్రశ్నలుంటే ఉపాధ్యాయుల సలహాలు తీసుకోవాలి.

చేతి రాత ఇలా ఉండాలి..

- జవాబు రాసే తీరు పరీక్ష పేపర్ దిద్దే ఉపాధ్యాయుడికి అర్థమయ్యేలా ఉండాలి.
- ఒక పేజీలో 18 నుంచి 19 లైన్లకు మించి రాయకూడదు. అప్పుడే నీట్‌గా కనబడుతుంది.
- మొదటి లైన్ రాసే ముందు మార్జిన్ చుస్తూ రాయాలి. లేకపోతె మిగతా లైన్లు వరుసక్రమంలో ఉండవు. వరుస ముగింపుతోనే పూర్తి పదం ఉండేలా చూసుకోవాలి.
- అంకెలు రాసేముందు స్పష్టతగా ఉండేలా చూసుకోవాలి. లేకుంటే అర్థంకాక మార్కులు తగ్గించే అవకాశం ఉంటుంది.
- సామాన్య శాస్త్రంలో బొమ్మలు గీస్తే ఆ చిత్రంలోని భాగాలు గుర్తించడంలో ఒక క్రమ పద్ధతి పాటిస్తే బాగుంటుంది.
- బ్రాకెట్లలో రాసే ఏబీసీడీలు పెద్ద అక్షరాలే రాయాలి. గణిత పరీక్ష రాసేటప్పుడు అంకెలు సక్రమంగా వేయాలి.
- వ్యాకరణ దోషాలు లేకుండా జాగ్రత్తపడాలి.
- జవాబు మొదలు పెట్టిన స్థలం నుండి చివర స్థలం వరకు సమాంతరంగా రాయాలి, పైకి, కిందకి వెళ్లకూడదు. క్రమంగా లేకుంటే ఆన్సర్ పేపర్ ఆకర్షణీయంగా కనబడదు.

ప్రణాళికతో చదివితే విజయం మీదే..



పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు వస్తాయి. ముందుగా పరీక్ష ఎలా రాయాలి అనే విషయాలపై అవగాహనా పెంచుకోవాలి. పటాలను గీయడం వాటి భాగాలు క్రమ పద్ధతిలో రాయడం, గత ప్రశ్న పత్రాలను తప్పకుండా పరిశీలించాలి. సందేహాలుంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలి. ఫైనల్ పరీక్షలకు ముందుగా వచ్చే ప్రీ ఫైనల్ పరీక్షలలో తప్పులను సరిదిద్దుకొని, చివర పరీక్షలకు సంసిద్ధమైతే అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చు.

-సురేష్, మానసిక వైద్య కౌన్సిలర్

సమయాన్ని సద్వినియోగించుకోవాలి



పరీక్షా గదిలో ఆ మూడు గంటల సమయాన్ని సరిగా సద్వినియోగం చేసుకుంటే మార్కులు రావడం అంత కష్టమైన పనేం కాదు. పరీక్షల్లో ఎలాంటి తొందరపాటు లేకుండా ముందుగా ఇచ్చిన ప్రశ్న పత్రాన్ని క్షుణ్ణంగా చదివి ఆ తరవాతే సమాధానాలు రాయాలి. మూల్యాంకనం చేసే వారికి అర్థం అయ్యే విధంగా రాత ఉండాలి. పరీక్షకు వెళ్లే గంట ముందు నుండి చదువకుండా ప్రశాంతంగా ఉండాలి. పరీక్షా సమయంలో ఏ విభాగానికి ఎంతెంత సమయం కేటాయించాలో ముందే ప్రణాళిక సిద్ధం చేయసుకోవాలి.

-అంజా గౌడ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, పాపన్న పేట

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



విధ్యార్థులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

హవేళిఘణపూర్, ఫిబ్రవరి14 (ఆంధ్యజ్యోతి) : పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్‌సూచించారు. శుక్రవారం మండలంలోని బూర్గుపల్లి ప్రభుత్వ న్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. కలెక్టర్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది పరీక్షల సమయం కావడంతో టీవీ, ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంఈవో మధుమోహన్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

డంపుయార్డుకు వ్యతిరేకంగా ట్రాక్టర్ల ర్యాలీ

- పోలీసులకు రైతు జేఏసీ నాయకుల మధ్య తోపులాట



రైతు జేఏసీ నేతల ర్యాలీని అడ్డుకుంటున్న పోలీసులు

గుమ్మడిదల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మండలంలో ప్యారానగర్ లో ఏర్పాటు చేయబోతున్న డంప్‌యార్డ్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన ఉద్యమం ఉధృతంగా కొనసాగుతుంది. జేఏసీ ఆధ్వర్యంలో పది రోజులుగా నిరసనలు చేపడుతున్నారు. శుక్రవారం జేఏసీ చైర్మన్ చిమ్ముల జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు భారీ సంఖ్యలో జాతీయ రహదారిపై ట్రాక్టర్ల ర్యాలీ తీసి నిరసన తెలిపారు. వీరిని అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట జరిగింది. అనంతరం టోల్గేట్ సమీపం వరకు ట్రాక్టర్ల ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా డంపుయార్డును ఏర్పాటు చేయొద్దంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మరోవైపు కొత్తపల్లి నల్లవల్లి గ్రామాల్లో డంపుయార్డును ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.

ఏఐతో అనేక మార్పులు

- జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహా



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నరసింహ

పుల్‌కల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని చౌటకూర్ మండలం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జి.నర్సింహ అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ)పై రెండు రోజుల పాటు నిర్వహించనున్న అవగాహన సదస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా, విద్య, వ్యవసాయ రంగాలతో పాటు డిజటల్ విధానంలో పలు రకాల మార్పులకు ఏఐ ఉపయోగపడుతుందన్నారు. అందుకనుగుణంగా విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల లభ్యత కనుమరుగవుతున్న తరుణంలో సొంతంగా స్టార్టప్ కంపెనీలు పెట్టడానికి ఏఐ సాఫ్ట్‌వేర్ ఉపయుక్తంగా ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో ఏఐ కేంద్రం ఏర్పాటు శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఈవీ ప్రాజెక్టు ఇంజనీరింగ్ హరీశ్‌సాత్విక్ వర్మ, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.రాఘవేందర్‌రావు, సీఎస్‌ఈ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దంగల్

5వ పేజీ తరువాయి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఎంపీ రఘునందన్, పార్టీ ముఖ్య నేతలు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ టికెట్ ఆశించిన ప్రసన్న హరికృష్ణ బీఎస్పీ నుంచి పోటీలో ఉన్నారు. కరీంనగర్ మేయర్‌గా పనిచేసిన బీఆర్‌ఎస్ నేత సర్దార్ రవీందర్‌సింగ్ ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బరిలోకి దిగారు. బీఆర్‌ఎస్ ముఖ్య నేతలతో సన్నిహిత సంబంధాలున్న యాదగిరి శేఖర్‌రావు సైతం స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల సంఘాల నేతగా ఆయనకు పేరుంది. వీరితోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోరు గరంగరం

సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న కూర రఘోత్తమరెడ్డి స్థానంలో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం వంగ మహేందర్‌రెడ్డిని బరిలోకి దింపింది. సామాజిక కార్యక్రమాలతోపాటు సంఘంలో సత్సంబంధాలు కొనసాగిస్తారని ఆయన పేరు ఖరారు చేశారు. నాలుగు నెలల ముందు నుంచే ఆయన ఉపాధ్యాయ ఓటర్ల నమోదు, ప్రచారంపై దృష్టిపెట్టారు. రఘోత్తమరెడ్డి సైతం పలు సంఘాల మద్దతుతో మరోసారి పోటీచేస్తూ తననే గెలిపించాలని, వేరేవారికి ఓట్లు వేయవద్దని కోరుతున్నారు. గత ఎన్నికల్లో రఘోత్తంరెడ్డి వెంట ఉన్నవారిలో చాలా మంది సంఘం నేతలు ప్రస్తుతం వంగ మహేందర్‌రెడ్డి గెలుపు కోసం శ్రమిస్తున్నారు. ప్రధాన పార్టీల్లో బీజేపీ మాత్రమే మల్క కొమురయ్యను బరిలోకి దింపగా ఆయన విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల ఓట్లపై బిస్మాట్ పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి జగ్గు మల్లారెడ్డి దృష్టిపెట్టారు. ఇతర అభ్యర్థులు వారివారి ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేట్ టీచర్ల మద్దతును కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.



భారీ ర్యాలీగా తరలి.. కాంగ్రెస్‌లో చేరిక

రామాయంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట ఉమ్మడి మండలం నుంచి బీఆర్‌ఎస్ నాయకులు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం రాత్రి వివిధ గ్రామాల నుంచి వచ్చిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఊరేగింపుగా ఫంక్షన్‌హాల్‌కి తరలివెళ్లి మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత్‌రావు, రమేష్‌రెడ్డి, రాంచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ కంటైనర్‌ను బైక్ ఢీ.. వ్యక్తికి తీవ్ర గాయాలు

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): లారీని బైక్ ఢీకొని వ్యక్తి గాయాలైన సంఘటన పట్టణంలోని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బెజుగామ గ్రామానికి చెందిన రొయ్యల నర్సింహులు బైక్‌పై ప్రజ్ఞాపూర్ నుంచి పిడిచెడు వెళ్తున్నాడు. మూలమలుపు వద్ద తిరిగే క్రమంలో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ప్రజ్ఞాపూర్ నుంచి తూప్రాన్‌కు వెళ్తున్న లారీ కంటైనర్‌ను బైక్ ఢీకొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

న్యూస్ బాక్స్

జాతరకు ఆహ్వానం

నిజాంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెంకటాపూర్‌కే గ్రామ శివారు నుంచి బోనాల కొండాపూర్ శివారులో వెలసిన లక్ష్మీనరసింహస్వామి జాతరకు హాజరుకావాలని శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డికి బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దయాకర్ వేర్వేరుగా ఆహ్వానపత్రికలు అందజేశారు.

విధుల బహిష్కరణ

నారాయణఖేడ్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టు అదనపు న్యాయమూర్తి హర్షపై జీవిత ఖైదు పడ్డ నేరస్తుడు చెప్పు విసరడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు.

'పరిశుభ్రతకు మహిళా సంఘాలు కృషి చేయాలి'

నాగల్‌గిద్ద, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పరిశుభ్రతకు మహిళా సమైక్య సంఘాల సభ్యులు కృషి చేయాలని నాగల్‌గిద్ద ఏపీఎం చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నాగల్‌గిద్ద ఏపీఎం కార్యాలయంలో ఆయా గ్రామాల మహిళా సంఘాల సమైక్య సభ్యులతోఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కోహీర్ మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

కోహీర్, ఫిబ్రవరి 14: (ఆంధ్రజ్యోతి) : కొత్తగా ఏర్పడిన కోహీర్ మున్సిపల్ కమిషనర్‌గా ఎస్.వెంకట్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌రెడ్డిని అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు సత్కరించారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

● కాపర్ వైర్, ఆయిల్ చోరీ

వెల్దుర్తి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వెల్దుర్తిలోని కుడి చెరువు సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు గురువారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. వెల్దుర్తికి చెందిన ఎన్.శ్రీనివాస్‌గౌడ్ వ్యవసాయ భూమి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి, అందులోని విలువైన కాపర్ వైర్‌ను, ఆయిల్‌ను చోరీ చేశారు. సంఘటనా స్థలాన్ని ఏఈ పెంట్యా నాయక్, ఏఎస్ఐ సదాత్‌మియా పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

ఆ జంక్షన్ మహా డేంజర్..

● బైపాస్ ఏర్పడ్డాక 30 మంది బలి
● మలుపులో తరచూ ప్రమాదాలే
● తృటిలో తప్పుతున్న మరెన్నో ఘటనలు
● బ్రిడ్జి నిర్మిస్తేనే ప్రాణాలకు అడ్డుకట్ట
● నివారణ చర్యలపై కలెక్టర్ పర్యవేక్షణ




రామాయంపేట జంక్షన్‌లో ప్రమాదాలు(ఫైల్)

రామయంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేట బైపాస్ జంక్షన్ ప్రమాదాలకు నిలయమైంది. క్షణ క్షణం ఈ మలుపులో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే బైపాస్ ఏర్పడ్డాక.. 30 నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఇక్కడ బ్రిడ్జి ఏర్పాటు చేయక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మరికొన్ని వెంట్రుకవాసిలో తప్పుతున్నాయి. ఇటీవలే మలుపులో బైక్, కారు ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. ఏడాదిక్రితం ఇరువురు, అంతకుముందు మరో ఇద్దరు ఇదే జంక్షన్‌లో ప్రాణాలొదిలారు. ఈ జంక్షన్ మహా డేంజర్ అని తెలిసినా.. నివారణ చర్యలపై అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. ఈ ప్రమాదాల పరిస్థితిని గమనించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ మూడునెలల క్రితం బైపాస్ జంక్షన్‌ను సందర్శించి.. ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఇకపై ఘటనలు జరగకుండా ఏం చేస్తే ఆపవచ్చో.. తహసీల్దార్, ఆర్డీఓ, పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశమై సలహాలు, సూచనలు తీసుకున్నారు. ఏదేమైనా ప్రతినిత్యం కళ్లముందే జరుగుతున్న దుర్ఘటనలతో కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు కలెక్టర్ సిద్ధమయ్యారు. ఇదిలా ఉంటే ఇప్పటికే జంక్షన్లలో ప్రమాదాల దృష్ట్యా జప్తిశివనూర్, చేగుంట, తూప్రాన్ ప్రాంతాల్లో బ్రిడ్జి నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ రామాయంపేటలో నేషనల్ హైవే అథారిటీ బ్రిడ్జి ఏర్పాటుపై దృష్టి సారించలేదు. దీనివల్ల అత్యధిక రద్దీ కలిగిన రెండు మలుపుల్లో జాగ్రత్త చర్యలు లేక.. ప్రమాదాలు ఉత్పన్నమవుతున్నాయి. ఇకనైనా అధికార యంత్రాంగం, పాలకులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

సేవాలాల్ మహరాజ్ ఆశయంతో ముందుకుసాగాలి

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న గిరిజనులు, పక్కన సంగ్రాంమహరాజ్

నారాయణఖేడ్/చేగుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సేవాలాల్‌మహరాజ్ ఆశయ సాధనతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం సేవాలాల్‌మహరాజ్ 286వ జయంతిని పురస్కరించుకుని ఖేడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంగల్‌పేటలోని దుర్గామాత ఆలయం ఖేడ్ పట్టణ పురవీధుల గుండా గిరిజన మహిళలు, గిరిజనులు సంప్రదాయ బద్ధంగా నృత్యాలు చేస్తూ శోభాయాత్ర నిర్వహించారు. ఇందులో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్, ఇరక్‌పల్లి పీఠాధిపతి దేవిదాస్ మహరాజ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్, వివిధ తండాల కారోబార్లు, పూజారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు. అలాగే పెద్దశంకరంపేట మండలం గొట్టిముక్కుల గ్రామంలో త్వరలో నిర్వహించనున్న ఆత్మలింగేశ్వరస్వామి ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం, శివపంచాయతన నవగ్రహ ప్రతిష్ఠాపనోత్సవానికి రావాలని గ్రామస్థులు ఎమ్మెల్యే సంజీవరెడ్డిని, ఆయన స్వగృహంలో ఆహ్వానపత్రిక అందజేశారు. చేగుంట మండల కేంద్రంలో శుక్రవారం సేవాలాల్ మహరాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు భారీ సంఖ్యలో పాల్గొని చేగుంట బస్టాండ్ నుంచి రెడ్డిపల్లి చౌరస్తా వరకు సంప్రదాయ నృత్యాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యల పరిష్కారానికి చర్యలు



సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న ప్రత్యేకాధికారి

రామచంద్రాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : డబుల్‌రూం ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులతో మున్సిపల్ ప్రత్యేకాధికారి పాల్గుణకుమార్ శుక్రవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల డబుల్ లబ్ధిదారులు కలెక్టర్ ముందుంచిన సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. అదనపు బస్సుల ఏర్పాటు కోసం డిపో మేనేజర్లతో మాట్లాడారు. ప్రధానంగా తాత్కాలిక పాఠశాల, ఆస్పత్రుల ఏర్పాటుపై మాట్లాడారు. మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి సమస్యల పరిష్కారానికి పలు సూచనలందించారు. డబుల్‌బెడ్ రూం ఇళ్లలో ఆస్తి పన్నులు వసూలుకు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు.. ఇప్పటివరకు మున్సిపల్ పన్నులు 50 శాతం వసూలు చేశామన్నారు. మరో 15 రోజుల్లో 90 శాతం పన్నులు వసూలు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మేనేజర్ అఖిల్‌కుమార్, ఇంజనీర్ శాఖ డీఈ సత్యనారాయణ, ఏఈ మోనిక తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమర జవాన్లకు నివాళులు



సంగారెడ్డిలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

సంగారెడ్డి టౌన్/జహీరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు నివాళులర్పిస్తూ శుక్రవారం రాత్రి జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సంయుక్త స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక రోడ్లు భవనాల శాఖ అతిథి గృహం నుంచి ప్రారంభమైన ర్యాలీ కొత్త బస్టాండ్ వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, యువజన సంఘాల రాష్ట్ర నాయకుడు కూన వేణుగోపాల్ తదితరులు జాతీయ జెండాలను శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీఎస్జీవో రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు, శ్రీధర్‌మహేంద్ర, పెరుమాండ్ల నర్సింలు పాల్గొన్నారు. అలాగే జహీరాబాద్ పట్టణంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బీదర్ చౌరస్తాలోని అమర జవాన్ల స్థూపం వద్ద శుక్రవారం పూలమాలవేసి నివాళులర్పించారు.



పోతులబొగుడలో బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న క్రాంతికిరణ్

ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు వాయిదా

● అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి/మునిపల్లి, ఫిబ్రవరి 14. (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందని, ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి చెందుతామన్న భయంతో.. ఈ ఎన్నికలను వాయిదా వేసిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. శుక్రవారం వట్‌పల్లి మండలం పోతులబొగుడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీరావు, సొసైటీ చైర్మన్ వినోద్‌గౌడ్, వరం మాజీ చైర్మన్ వీరారెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు అశోక్‌గౌడ్ పాల్గొన్నారు. అలాగే మునిపల్లి మండలంలోని పోల్కంపల్లి గ్రామ శివారులో గల పీఎస్ఆర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ డైరీ, క్యాలెండర్‌ను మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబర్‌లో మెదక్, రామాయంపేట మున్సిపాలిటీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన వివిధ దశల్లో ఉన్న పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మెదక్, రామాయంపేట మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్, అధికారులు పాల్గొన్నారు.

సహాయం కోసం వచ్చేవారికి భరోసా కల్పించాలి: మెదక్ ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): సహాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరిని మర్యాదపూర్వకంగా ఆహ్వానించి, వారికి మేము ఉన్నామనే భరోసా కల్పించాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీసు సిబ్బందికి సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నియామకమైన పోలీస్ సిబ్బంది మొదటి బ్యాచ్ శిక్షణ ముగింపులో పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సత్వర న్యాయం జరగడానికి సాంకేతిక వనరులను వినియోగించుకోవాలన్నారు.

'అక్రమ నిర్మాణాలపై విచారణ జరపాలి'

హత్నూర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని గుండ్లమాచునూర్ గ్రామ శివారులో గల కోవలంట్ లాబొరేటరీస్ పరిశ్రమలో నిర్మించిన అక్రమ నిర్మాణాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు మండల పంచాయతీ అధికారి యూసుఫ్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కొంతకాలంగా కోవలంట్ లాబొరేటరీ పరిశ్రమ యాజమాన్యం పరిశ్రమ ఆవరణలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడంతో పాటు గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డును ఆనుకొని సుమారు వంద టన్నుల బాయిలర్ ఏర్పాటు చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారులు విచారణ చేసి పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యం



నర్సింహులు (ఫైల్)

ఫోటోరైటప్.14.ఎస్ఆర్డి.9. ముష్టి నర్సింహులు(ఫైల్)

కంది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : బయటకు వెళ్లొస్తానని ఇంటినుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన కంది మండల పరిధిలోని చెర్లగూడెం గ్రామంలో బుధవారం చోటు చేసుకున్నది. ఇంద్రకరణ్ ఎస్ఐ విజయ్ కుమార్ వివరాల ప్రకారం.. చేర్లగూడెం గ్రామానికి చెందిన ముష్టి నర్సింహులు(50) బుధవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శుక్రవారం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రేగోడులో యువతి...



నవ్య(ఫైల్)

రేగోడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైంది. రేగోడ గ్రామానికి చెందిన గొండ్ల నవ్య(19) 13న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి లక్ష్మీ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పోచయ్య తెలిపారు.

ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : పాటి గ్రామ సమీపంలోని ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం కొల్లూరు నుంచి పటాన్‌చెరు వెళ్తున్న బీఎండబ్ల్యూ కారు ముందు వెళ్తున్న ఆటో ట్రాలీని ఢీకొట్టింది. బెలూన్స్ ఓపెన్ కావడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కాగా కారు నుజ్జునుజ్జయింది. సంఘటనా స్థలానికి చేరుకున్న బీడీఎల్ పోలీసులు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు



ఆలయం వద్ద ఏర్పాట్లు

ఝరాసంగం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మాచ్నూర్ గ్రామశివారులో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న శ్రీరామలింగేశ్వరస్వామి జాతర శనివారం నుంచి ప్రారంభంకానున్నది. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీసభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లను వేశారు. ఈ ఉత్సవాలకు బర్దీపూర్ ఆశ్రమ పీఠాధిపతి వైరాగ్యశిఖామణి అవధూత గిరిమహరాజ్, ఇతర ఆశ్రమాలకు చెందిన పీఠాధిపతులు హాజరుకానున్నారు.

నేటి నుంచి దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన

తూప్రాన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో నిర్మించిన శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం 15 నుంచి 17 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అమిరిశెట్టి వీణసతీష్ కుమార్ దంపతులు తెలిపారు. ఈ కార్యక్రమానికి జగద్గురు పుష్పగిరి శంకరాచార్య పీఠాధీశ్వరులు జగద్గురు, అభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన

పాపన్నపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ విగ్రహ పునఃప్రతిష్ఠాపన పాపన్నపేటలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదబ్రాహ్మణులు గణపతిపూజతో కార్యక్రమం ప్రారంభించారు. స్వస్తివాచనం, రక్షాబంధనం, పంచగవ్య విధి, అంకురార్పణం, గౌరీమాతృకా పూజ, యాగశాల ప్రవేశం, నవగ్రహ మండల పూజ, ప్రదోశ పూజ తీర్థ ప్రసాద వితరణ గావించారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



పొలడుగులో ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

వట్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి మండలంలోని పాలడుగు గ్రామానికి 20 రోజులుగా మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో సమస్య మరింత జటిలమవుతుందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. రెండురోజుల్లో సమస్య పరిష్కరించకుంటే మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

కేసులను సత్వరమే పరిష్కరించాలి: డీఎస్పీ

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కేసులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆదేశించారు. శుక్రవారం పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడి కేసుల వివరాలు తెలుసుకున్నారు. పలు రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి: ఆర్డీవో

నర్సాపూర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : త్వరలో నిర్వహించనున్న పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు నర్సాపూర్ డివిజన్‌లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్డీవో మహిపాల్ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్‌లోని జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నర్సాపూర్ డివిజన్ పరిధిలోని నర్సాపూర్, కొల్చారం, చిలప్‌చెడ్, శివ్వంపేట, కౌడిపల్లి మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నర్సాపూర్‌లో జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేయనుండగా.. మిగతా మండల కేంద్రాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

వ్యాపారం రంగంలో రాణించేందుకే 'విపణి'



'విపణి' కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులు ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో 19న కళాశాలలో 'విపణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డిలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.అరుణాబాయి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థిలు చదువుతో పాటు వ్యాపార రంగంలో రాణించాలనే సదుద్దేశంతో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో విపణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం 'విపణి' కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

కంది/నిజాంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ఉపాధ్యాయులుగా మారి పాఠ్యాంశాలు బోధించారు. కంది మండలంలోని ఎద్దుమైలారం జడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి మిగతా తరగతులకు పాఠ్యాంశాలు బోధిస్తూ అబ్బురపరిచారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. నిజాంపేట మండల చల్మెడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో స్వయం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్, ఉపాధ్యాయ బృందం మోహన్, మమత, జ్యోతిలక్ష్మి, నవీన్ రత్నాకర్, మమత పాల్గొన్నారు.

'డీసీసీ' సేవలు సద్వినియోగం చేసుకోండి

మనూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : డీసీసీ బ్యాంకు పరిధిలో ఉన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ డీసీసీ బ్యాంకు మేనేజర్ వెంకటేశం అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన మనూరు డీసీసీ బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డీసీసీ బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేస్తే అత్యధిక వడ్డీ రేటు ఇస్తామని తెలిపారు. మిగతా బ్యాంకులో విధంగా గూగుల్‌పే, ఫోన్‌పే, ఏటీఎం కార్డులు సౌకర్యం తమ బ్యాంకులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది యాకుబ్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం



బోర్డు పాతున్న రెవెన్యూ అధికారులు

హత్నూర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామ శివారులోని సర్వే నెంబరు 336లో గల ఇతరుల ఆధీనంలో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొంతకాలంగా దౌల్తాబాద్‌కు చెందిన కొందరు సాగు చేస్తుండగా, ఈ భూమిని నిరుపేదల ఇళ్ల స్థలాలకు కేటాయించాలని గతంలో నిరుపేదలు గుడిసెలు వేసుకుని సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేశారు. కొంతకాలంగా ఈ భూమిలో ఎలాంటి కార్యకలాపాలు చేపట్టలేదు. ఇటీవల దౌల్తాబాద్‌కు చెందిన కొందరు వ్యవసాయ కార్యకలాపాలు నిర్వహిస్తున్న విషయం పత్రికల్లో వచ్చింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఫర్హీన్‌షేక్ భూమిని పరిశీలించి, ప్రభుత్వ భూమిగా నిర్ధారించి, బోర్డు ఏర్పాటు చేశారు.

'సొసైటీ చైర్మన్ రాజీనామా చేయాలి'

టేక్మాల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : టేక్మాల్ సొసైటీలో అవినీతి చేసినట్లయితే రాజీనామా చేస్తానన్న చైర్మన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నిమ్మ రమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సంఘంలో రూ.21,34,933 లక్షల అవినీతి జరిగినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలిందని, దీనికి బాధ్యులైన సొసైటీ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, సీఈవో వేణుగోపాల్ తక్షణమే రాజీనామా చేసి కాజేసిన సొమ్మును సంఘానికి చెల్లించాలన్నారు.

రోడ్డెక్కితే.. దుమ్ము, ధూళి



తెల్లాపూర్ రోడ్డుపై లేస్తున్న దుమ్ము

రామచంద్రాపురం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీలో ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్డు 30 ఎక్స్‌టెన్షన్ దశాబ్దకాలమైనా పూర్తికాలేదు. ముఖ్యంగా నిర్మాణ పనులను బిల్డర్లు అధికంగా చేపట్టడంతో వాయుకాలుష్యం ఏర్పడుతుంది. 24 గంటల పాటు నిర్మాణ పరికరాలను తీసుకువెళ్లే వాహనాలు రాకపోకలు సాగించడంతో దుమ్ము ఏర్పడుతుంది. రోడ్డు పక్కన దాదాపు మూడుమీటర్ల మేర దుమ్ము పేరుకుపోతుంది. ఈ దుమ్ము ప్రయాణికులు, పాదచారులపై పడుతుంది. కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోలేదు. ఈ విషయం స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు.